ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 131 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 20 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు
# పెద్దపీట

**రూ. 9,450 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు**

**ఏపీ నాలుగు రాష్ట్రాలకు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

**కేంద్ర కేబినెట్ కమిటీ గ్రీన్ సిగ్నల్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు ₹9,450 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు భారీ మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల పరిధిలోని ప్రయాణికులకు, సరుకు రవాణా రంగానికి ఎంతో మేలు చేయనుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే రైళ్ల రాకపోకల వేగం పెరగడమే కాకుండా, పట్టాలపై రద్దీ గణనీయంగా తగ్గుతుంది. 'పీఎం గతిశక్తి' ..మిగతా 2లో

## జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం
# ప్రిన్సిపల్ హత్య



**రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు**

**హత్యకు పాల్పడింది ..అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్**

**జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య**

**వివరాలు తెలియడంతో విస్తుపోయిన టీచర్లు, స్టూడెంట్స్**

**నల్గొండ ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

నల్గొండ జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించి కటకటాల్లోకి నెట్టారు. డబ్బుపై ఆశతో పాటు ప్రిన్సిపాల్‌పై పెంచుకున్న కక్షే ఈ ఘాతుకానికి కారణమని విచారణలో తేలింది. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు పదో తరగతి మైనర్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైంటిఫిక్ దర్యాప్తు, సీసీటీవీ ఫుటేజ్, ఫోరెన్సిక్ ఆధారాలు మరియు సాంకేతిక విశ్లేషణ ఈ కేసును ..మిగతా 2లో

## ఇప్పుడున్న సీట్లను యధాతథంగా కొనసాగించాలి

**అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు.. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

లోకసేభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తం గా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు ..మిగతా 2లో



## నేడు దక్షిణాది రాష్ట్రాల
# సిఎంల భేటీ

**అమిత్ అధ్యక్షతన భేటీ**

**చెన్నై ఆగస్ట్19 (ప్రభాత ఉదయం)**

తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ముఖ్యమంత్రులు హాజరవుతారు. ఈ సమావేశానికి సీఎం చంద్రబాబు ..మిగతా 2లో

## సిఎం రేవంతా.. పొంగులేటా...
# అర్థం కావడం లేదు


**బాంబు పేల్చిన సుష్మితా పటేల్**

**కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం**

**తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ**

**వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి**

2లో..



# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

**ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి .. పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి**

**అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం**



**హైదరాబాద్,ఆగస్టు19 (ప్రభాత ఉదయం)**


నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా ..మిగతా 2లో

## త్వరలోనే విజయసాయిరెడ్డి
# రాజకీయ పార్టీ

**త్వరలోనే ప్రకటన చేయబోతున్నా**

**ప్రజావాణిని చట్టసభల్లో వినిపిస్తాం**

**హైదరాబాద్, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**



తిరుమల శ్రీవారిని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల సమస్యలు, ప్రజావాణిని చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ఓ రాజకీయ పార్టీని ప్రారంభించాలని సంకల్పించినట్లు విజయసాయి రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నానని చెప్పారు. రాజకీయ పార్టీ ఏర్పాటుకు ..మిగతా 2లో

# జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య

**మొదటి పేజీ తరువాయి...**

కొలిక్కి తేవడంలో కీలక పాత్ర పోషించాయి. హత్యకు గురయ్యే ముందు ప్రిన్సిపాల్ రూపారెడ్డి మాట్లాడిన చివరి ఒకే ఒక్క పదం ఈ కేసు దర్యాప్తులో అతిపెద్ద మలుపుగా మారింది. ఫోన్ సంభాషణ ముగిసే సమయంలో ఆమె నోటి నుంచి వచ్చిన "బాబు" అనే మాటను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆమె ఎవరిని ఉద్దేశించి ఆ మాట అన్నారనే కోణంలో విచారణ చేపట్టగా.... అనుమానం నేరుగా పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది. దీంతో దర్యాప్తు అధికారులు స్కూల్ విద్యార్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలు అహోరాత్రులు శ్రమించాయి. పోలీసులు దాదాపు 30 కిలోమీటర్ల పరిధిలోని 70కి పైగా సీసీటీవీ కెమెరాల్లోని దృశ్యాలను నిశితంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన 80 మందికి పైగా వ్యక్తులను సుదీర్ఘంగా విచారించారు. చివరకు సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారం సాయంతో నిందితులైన ఆ ఇద్దరు పదో తరగతి విద్యార్థులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుంచి రూ. 1.54 లక్షల నగదుతో పాటు రూపారెడ్డి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన ఆయుధం, హ్యాండ్ గ్లౌజులు, మాస్కులు మరియు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అసలేం జరిగిందంటే..?**

జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి చోరీకి వెళ్లారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉ



ంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారు. "రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ "బాబు" అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది" అని జిల్లా ఎస్పీ వివరించారు.

"అరెస్ట్ అయిన ఇద్దరు నిందితుల్లో ఒక విద్యార్థి గతంలో అదే స్కూల్ హాస్టల్‌లో ఉంటూ చదువుకునేవాడు. కొద్దిరోజుల క్రితం అతడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా, అందులో కొంత డబ్బుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొరికింది. దీంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, ఇతర టీచర్లు అతడిని తీవ్రంగా మందలించారు. అంతేకాకుండా తల్లిదండ్రులను స్కూలుకు పిలిపించి...... వారి ముందే హెచ్చరించి హాస్టల్ నుంచి తొలగించి డేస్కాలర్‌గా మార్చారు. అందరి ముందూ తమను మందలించారనే అవమానంతో సదరు విద్యార్థి ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై తీవ్రమైన కక్ష పెంచుకున్నాడు. మరోవైపు ఈ మైనర్ నిందితుడికి మద్యం తాగే అలవాటుతో పాటు బైక్‌లపై తిరగడం అంటే తీవ్రమైన మోజు ఉండేది. ఇటీవల ఒకసారి గోవా టూర్‌కు కూడా వెళ్లొచ్చినట్లు దర్యాప్తులో తేలింది. ఎలాగైనా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించి జాలీగా గడపాలనే ఆలోచనతో, ప్రిన్సిపాల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేయాలని పథకం వేశాడు. ఇందుకోసం మరొక మైనర్ స్నేహితుడిని కూడా తనతో పాటు కలుపుకున్నాడు" అని ఎస్పీ తెలిపారు. పథకం ప్రకారం ఈ నెల 11వ తేదీన ప్రిన్సిపాల్ స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, నిందితులు ఇద్దరూ కలిసి ఆమె ఇంటికి చేరుకున్నారు. అందులో ఒక విద్యార్థి ముఖానికి మాస్క్ ధరించి కాంపౌండ్ గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. అయితే అనుకోకుండా అతడి ముఖానికి ఉన్న మాస్క్ ఊడిపోవడంతో.... ప్రిన్సిపాల్ రూపారెడ్డి అతడిని వెంటనే గుర్తుపట్టారు. తాను దొరికిపోయాననే భయంతో సదరు విద్యార్థి దారుణానికి ఒడిగట్టాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా ఆమెను హత్య చేశాడు" అని జిల్లా ఎస్పీ వివరించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాల పనితీరును నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు. కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి పురస్కారాలు అందజేస్తామని ఆయన ప్రకటించారు.

# నేడు దక్షిణాది రాష్ట్రాల సీఎంల భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఏపీ ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన ప్రస్తావించనున్నారు. ఆ క్రమంలో ఏపీ పునర్విభజన చట్టం అమలుపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్రం చొరవ తీసుకోవాలని కోరనున్నారు. షెడ్యూల్ 9,10 సంస్థల విభజనపై కేంద్రం దృష్టికి ఆయన తీసుకెళ్లనున్నారు. ఆస్తులు, అపల పంపకం, పెండింగ్‌లోని ఆర్థిక అంశాల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. అలాగే రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలను కూడా ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. దుగరాజుపట్నం పోర్టు అంశాన్ని కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్రాన్ని ఆయన కోరనున్నారు. రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధిపై చర్చించనున్నారు. పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర సహకారం ఆయన కోరనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అంశాన్ని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అందిస్తున్న సహకారానికిగాను కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలపనున్నారు. మిగిలిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయడంతోపాటు నిధులు సమకూర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు.



# సీనియర్ నాయకులు క్యామ మల్లేష్‌ను పరామర్శించిన కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడుఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**

ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై కోలుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్‌ను కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.మల్లేష్ నివాసానికి వెళ్లిన వెంకటేష్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు త్వరగా పూర్తిగా కోలుకునేందుకు తీసుకుంటున్న విశ్రాంతి,వైద్యుల సూచనలపై ఆరా తీశారు.ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడుతోందని తెలుసుకున్న వెంకటేష్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ... ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేసే క్యామ మల్లేష్ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజా జీవితంలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఆయనకు పార్టీ నాయకులు,కార్యకర్తలతో పాటు అభిమానులంతా అండగా ఉన్నారని తెలిపారు.మల్లేష్ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం మల్లేష్‌తో కొద్దిసేపు మాట్లాడి ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు కూడా మల్లేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ శ్రీశైలం,మణికొండ మాజీ కౌన్సిలర్ ముత్యాలు,పార్టీ నాయకులు అడికె అర్జున్,గూడెం సత్యనారాయణ,ఆనంద్,అశోక్,రమేష్,రామస్వామి,రిషి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంతా.. పొంగులేటా... అర్థం కావడం లేదు

## బాంబు పేల్చిన సుష్మితా పటేల్

**కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకుంటే ఒంటరిపోరాటం**

**తెలంగాణ రాజకీయాల్లో కాక రేపిన కొండాసురేఖ తనయ**

**వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి మల్లు రవి**

**వరంగల్,ఆగస్ట్19 (ప్రభాత ఉదయం)**

మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మితా పటేల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ కాక రేపుతున్నాయి. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య పోటీ జరుగుతోందని వ్యాఖ్యానించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా పటేల్ ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తమ ఇలాఖాకు వచ్చి తమతో ఎందుకు పెట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన అవినీతిపై ఇప్పటివరకు రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే బయటపెట్టానని సుష్మితా పటేల్ ఆరోపించారు. తనపై కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల సమయానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో, ఉండరో కూడా సందేహమేనని సుష్మితా పటేల్ వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకున్న తర్వాత ఆమెపై పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# భూభారతి ఆపరేటర్ మృతి


**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**

ఎర్రవల్లి మండలం తహసిల్దార్ ఆఫీస్ లో భూభారతి ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న రాంబాబు(33) ఈనెల 6వ తేదిన విధులు ముగించుకుని స్వగ్రామమైన మానవపాడు మండలం బూడిదపాడు గ్రామానికి బైక్ పై బయలుదేరాడు. జాతీయ హైవేపే వాహనాల వేగానికి బైక్ అదుపుతప్పి కిందపడాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబు హైదరాబాద్ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ఉంది. బుధవారం స్వగ్రామంలో రాంబాబు అంత్యక్రియలు నిర్వహించారు. కాగ భూభారతీ ఆపరేటర్ల పరిస్థితి దారుణంగా మారింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం భూభారతి ఆపరేటర్ తొలగించింది. అయితే 2025 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 15 నెలల వేతనాలు రానప్పటికీ విధులు నిర్వర్తిస్తున్నారు. భూభారతి ఆపరేటర్లను ప్రభుత్వం పునరాలోచన చేసి మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ అందరినీ కొనసాగించాలని ఆ యూనియన్ నాయకులు ప్రభుత్వానికి విన్నపించారు.



# జూరాల డ్యాంపై ఘోర రోడ్డు ప్రమాదం: ముగ్గురికి తీవ్ర గాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యాంపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం... నందిమల్ల వైపు నుండి గద్వాల వైపు ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తున్న క్రమంలో జూరాల ప్రాజెక్టు రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉండటంతో పాటు, రాత్రి వేళ కావడం వల్ల బైక్ నడుపుతున్న వ్యక్తి దానిని గమనించలేదు. దాంతో బైక్ అదుపుతప్పి తీవ్ర వేగంతో కిందపడిపోయింది.ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాజెక్టుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉండటంతో రాత్రివేళ కనిపించకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి...**

పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ది పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

# రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**మొదటి పేజీ తరువాయి...**

జాతీయ మాస్టర్ ప్లాన్ ప్రాతిపదికన రూపొందించిన ఈ పథకాల ద్వారా దాదాపు 6,448 గ్రామాలకు, సుమారు 60 లక్షల మంది జనాభాకు నేరుగా మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రాంతీయంగా స్వయం సమృద్ధిని సాధించడమే కాక, కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విరివిగా సృష్టిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

**పర్యాటక రంగానికి బూస్ట్.. పర్యావరణానికి రక్షణ**

ఈ కొత్త లైన్లు అందుబాటులోకి వస్తే నేలపట్టు పక్షుల కేంద్రం, పులికాట్ సరస్సు, భితర్కనిక నేషనల్ పార్క్, కుల్డిహా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, చండీపూర్ బీచ్, లలితగిరి బౌద్ధ క్షేత్రం, లార్డ్ వీరరాఘవ పెరుమాళ్ కోవెల, దబలేశ్వర్ ఆలయం వంటి ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. దీంతో పాటు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్, ధాన్యాల రవాణా వేగవంతమై, ప్రతి ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల సరుకు రవాణా సాధ్యమవుతుంది. రైలు రవాణా పెరగడం వల్ల సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా, 65 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. ఇది 2.60 కోట్ల చెట్లను నాటడంతో సమానమని కేంద్రం తన ప్రకటనలో వివరించింది.

**నాలుగు కీలక రైల్వే లైన్లు ఇవే..**

ఖరగ్‌పూర్ - భద్రక్ (రాణితాల్) 4వ లైన్: 173 కిలోమీటర్లు

గుమ్మిడిపూడి - గూడూరు 3వ, 4వ లైన్: 90 కిలోమీటర్లు (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు అత్యంత కీలకం)

భద్రక్ - హరిదాస్‌పూర్ 4వ లైన్: 75 కిలోమీటర్లు

కటక్ - పారాదీప్ (బడబంధ) 3వ, 4వ లైన్: 72 కిలోమీటర్లు

60 లక్షల మంది ప్రజలకు నేరుగా ప్రయోజనం

# త్వరలోనే విజయసాయిరెడ్డి రాజకీయ పార్టీ

**మొదటి పేజీ తరువాయి...**

సంబంధించి త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నట్లు విజయసాయి రెడ్డి వెల్లడించారు. విజయవాడ వేదికగా ఈ నెలలోనే తన రాజకీయ ప్రణాళికను ప్రకటిస్తానని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయ కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు, దాని లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణపై విజయవాడలో స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రం, దేశంలో కరువు పరిస్థితులు లేకుండా సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు విజయసాయి రెడ్డి చెప్పారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. విజయసాయి రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఆయన ప్రకటించబోయే రాజకీయ ప్రణాళికపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. విజయవాడలో జరిగే ప్రకటనలో పార్టీ పేరు, విధివిధానాలు, రాజకీయ లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది

# ఇప్పుడున్న సీట్లను యధాతథంగా కొనసాగించాలి

**మొదటి పేజీ తరువాయి...**

మీడియాకు వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# వ్యవసాయ శాస్త్రవేత్తలు - మీడియా కలసి రైతాంగం శ్రేయస్సు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది

### నార్మ్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

**రాజేంద్రనగర్, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం) :**

వ్యవసాయ పరిశోధకులకు, రైతులకు మధ్య ఉన్న గ్యాప్ ను తగ్గించి వారికి కావాల్సిన సమాచారాన్ని అందజేయడంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రంగాలు, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులు కృషి చేయాలని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మె ంట్ (నార్మ్) డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం అన్నారు. వ్యవసాయ రంగం, మీడియా సమన్వయం , సమాచార ప్రసారాలను మెరుగుపరచడం అనే అంశంపై బుధవారం రాజేంద్రనగర్ లోని నార్మ్ లో జరిగిన వర్క్ షాప్ ను ప్రారంభించిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం ప్రసంగించారు. ప్రయోగశాలలో చేసిన పరిశోధనలు రైతుల పొలాలలోకి వెళ్లాలని, అందుకోసం మీడియా పూర్తి సహకారం అందిం చాలన్నారు. తాను జాతీయ వరి పరిశోధన సంస్థ లో డైరెక్టర్ గా పనిచేసిన సమయంలో జర్నలిస్టులు ఎంతగానో సహకరించారని గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన సాం కేతికతలను సమర్థవంతంగా వ్యాప్తి చేయడం,



అగ్రి - మీడియా సమన్వయం పై నార్మ్ లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, ఎక్స్ టెన్షన్ విభాగం హెడ్ డాక్టర్ వెంకట కుమార్, ప్రజా సంబంధాల అధికారిణి గుత్తికొండ అనీజ లు

వ్యవసాయ రంగంలోని ముఖ్యమైన పరిణామాలను ప్రజలకు తెలియజేయడం కోసం మీడియా ముందుండి పనిచేయాలన్నారు. పరిశోధనా సంస్థలు చేస్తున్న పరిశోధనలు రైతులకు చేరాలంటే వారి వారి స్థానిక భాషలలో తెలియ జేయడం చాలా ముఖ్యమన్నారు. స్థానిక భాషలలో వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందచేయడంలో మీడియా పాత్ర ఎంతో ఉన్నతమైనదన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా వర్చువల్ విధానంలో మాట్లాడిన మహీంద్రా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ డిజిటల్ మీడియా కమ్యూనికేషన్స్ డాక్టర్ కూర్మనాథ్ రైతులకు సరైన సమాచారం వెళ్లాలన్నారు. అందుకు మీడియా కృషి చేయాలన్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థలు వారి వారి వెబ్ సైట్ లలో పాలసీ పేపర్స్ ను అప్లోడ్ చేస్తారని, వాటిని తెలుసుకుని మరింత సమాచారాన్ని తీసుకుని రైతాంగానికి ఉప యోగపడే విదంగా వార్తలు రాయాలన్నారు. ఎల్ నీ నో ప్రభావం పై శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాలని సూచించారు. నార్మ్ ఎక్స్ టెన్షన్ సిస్టమ్స్ మేనేజ్మెం ట్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్ వెంకట్ట కుమార్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 114 ఐసీఏఆర్ అనుబంధ సంస్థలు, 77 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని, వీటన్నింటిలో ఐసీఏఆర్ కమ్యూనికేషన్ పాలసీ పేరుతో ప్రతి సంస్థలో ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించి వారి ద్వారా ఆయా సంస్థలు చేస్తున్న పరిశోధనలను రైతులకు తెలియజేయాలనే ఆలోచన లతో ముందుకు సాగుతున్నామన్నారు. నార్మ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్, ప్రజా సంబందాల అధికారిణి గుత్తికొండ అనీజ స్వాగతోపన్యాసం చేశారు. నార్మ్ లో చేపడుతున్న విద్యా, విస్తరణ. పరిశోధనల గురించి వివరించి చె ప్పారు.


అంతర్ రాష్ట్ర డ్రగ్స్ ముఠా వివరాలను వెల్లడిస్తున్న శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్, ఎస్.ఓ.టి డిసిపి శోభన్ కుమార్ ఇతర అధికారులు..

# సైబరాబాద్ పోలీసుల దెబ్బకు విలవిలలాడిన అంతర్‌రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్!

### గచ్చిబౌలి, ఎస్ ఓ టి జాయింట్ ఆపరేషన్
### రూ 16.40 లక్షల డ్రగ్స్ సీజ్, 19 మంది అరెస్ట్

**శేరిలింగంపల్లి : ఆగష్టు 19, (ప్రభాత ఉదయం)**

యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు రాక్షసుడిపై సైబరాబాద్ పోలీసులు సమరభేరి మోగించారు. గచ్చిబౌలి పోలీసులు స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడిలో భారీ అంతర్‌రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టు రట్టయింది. రూ 16.40 లక్షల విలువ చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్ ఎస్ ఓ టి డిసిపి శోభన్ కుమారులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 11న వట్టినాగులపల్లి వద్ద చేపట్టిన తనిఖీల్లో ప్రధాన నిందితుడు ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా కు చెందిన కొరిపెల్ల యశ్వంత్ సాయి, షణ్ముఖ్ పోలీసులకు చిక్కాడు. విచారణలో కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్, బెంగళూరుకు చెందిన నవీనా కేడీలు తనకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

**రాష్ట్రాలు దాటి పట్టుకున్నారు:**

ప్రత్యేక బృందాలు ఆగష్టు 18న కేరళలోని త్రిస్సూర్, బెంగళూరులోని బేగూర్‌లలో దాడులు చేసి మిగిలిన ఇద్దరు కీలక పెడ్లర్లను అరెస్ట్ చేశారు.

పెడ్లర్లతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న 16 మంది వినియోగదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు శేరిలింగంపల్లి డీసీపీ తెలిపారు.

**రూ.16.40 లక్షల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం**

ఎండీఎంఏ డ్రగ్ 95.41 గ్రాములు, గంజాయి ఓజీ ఖుష 50 గ్రాముల తోపాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ 16.40 లక్షలు ఉంటుందని తెలిపారు.

**తల్లిదండ్రులూ జాగ్రత్త**

డ్రగ్స్ సరఫరా చేయడంలేదు సేవించడంపై శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ ఓ టి డీసీపీ శోభన్ కుమార్ విద్యార్థులను హెచ్చరించారు. డ్రగ్స్ రవాణా, విక్రయాలపై ఉ క్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. యువత ఈ మత్తు రొంపిలో దిగి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ముఖ్యంగా విద్యార్థులు, యువత నడవడికపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ఓ కంట కనిపెట్టి నిఘా ఉంచాలని సూచించారు. మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం! డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా భయపడకుండా వెంటనే తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు సంపూర్ణంగా గోప్యంగా ఉంచుతామన్నారు. ఎద్దైన సమాచారం ఉంటే సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061 తెలియ చేయాలని డీసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలలో ఏసీపీ గోవర్ధన్, సీఐ నరేష్ తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు

### గురుస్వామి ప్రసాద్‌రావుకు ఘన సన్మానం.. పేదలకు అండగా నిలవాలని పిలుపు

**కూకట్ పల్లి, ఆగష్టు 19 (ప్రభాత ఉదయం)**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్వీ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్వాహకులు, అయ్యప్ప స్వామి భక్తుడు, గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం



ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డులోని శ్రీ సాయి జ్యోతి మెడికల్ దుకాణం వద్ద భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావును ఘనంగా సన్మానించి, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమితి సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు కలిసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ధర్మాన్ని పాటిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలి జన్మదిన వేడుకల సందర్భంగా ఇనగంటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో తన జన్మదిన వేడుకలను అందరూ కలిసి నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ, మానవత్వాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి తమకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచి, తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు. "మనకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందించడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటుకోవాలి. అందరం కలిసికట్టుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలకు అండగా నిలవాలి" అని ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యుల అభినందనలు ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావు అయ్యప్ప స్వామిపై భక్తిశ్రద్ధలతో పాటు సేవా కార్యక్రమాల పట్ల కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టే శక్తిని అయ్యప్ప స్వామి ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కొట్టం శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వాసుగుప్తా, వడకట్టు శ్రీనివాస్(మెడికల్ ) , చిట్టిబాబు,సూర్య కిరణ్, ఆర్ కే రాజు పటేల్, మధు, చిన్న, మధుగుప్తా, పురుషోత్తం, జంఫిర్,రత్నం, కోటి, నాగరాజు తదితరులు పాల్గొని గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్ లను పొందిన ఆనందంలో....

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను కనిపెట్టవచ్చు

**బుద్వేల్, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

సెంట్రల్ ఎక్యూప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న 25 సెల్ ఫోన్లను రికవరీ చేసిన అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య వాటిని వాటి యజమానులకు అప్పగించారు. వీటి విలువ రూ. రెండు లక్షల వరకు ఉంటుందని అంచనా. పోయిన సెల్ ఫోన్ లు తిరిగి లభించడంతో వాటిని పొందుకున్న వారు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మొబైల్ ఫోన్ పోయినా, చోరికి గురైన వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు సీఈఐఆర్, ఎన్ సీ ఆర్ పీ పోర్టల్, 1930 హెల్ప్ లైన్ కు పోన్ చేయాలని ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్ పెక్టర్ రాజు నాయక్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తాం: డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు టి ప్రేమ్ గౌడ్

### గణేష్‌నగర్‌లో రూ.30లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం..
### మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్
### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహకారంతో విస్తృతంగా అభివృద్ధి పనులు..

**రాజేంద్రనగర్,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**

మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్‌లో ఎమ్మెల్యే టీ.ప్రకాశ్‌గౌడ్ సహకారంతో రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్ శ్రీకారం చుట్టారు.స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు సౌకర్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.గణేష్‌నగర్‌లో రోడ్ల పరిస్థితిపై స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని కోరారు.అభివృద్ధి పనులు పూర్తయితే కాలనీవాసులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు.నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్.ధనుంజయ,బాస శ్రీను,లక్ష్మారెడ్డి, గట్టయ్య,బుచ్చయ్యతో పాటు స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండల వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి



కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందించేలా తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పీ ఆర్ టీ యూ రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్ సాగర్ లు

# పీఆర్టీయు రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సుదర్శన్, శ్రీనివాస్ సాగర్‌లు

**బుద్వేల్, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**


పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్షులుగా సుదర్శన్ కడుమూరు, ప్రధాన కార్యదర్శిగా ఆస్కాని శ్రీనివాస సాగర్ లు నియమితులైనారు. బుధవారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి నూతన కమిటీ ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా మాణిక్యం రెడ్డి నియమితులైనారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ, ఉ పాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో పీఆర్టీయు టీచర్స్ అసోసియేషన్ లో ఉన్న రాజేంద్రనగర్ మండలానికి చెందిన ఉ పాధ్యాయులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్

# నైట్రా జెపామ్ మాత్రల అక్రమ విక్రయం చేస్తున్న ముగ్గురు అరెస్ట్

**బుద్వేల్, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం) :**

నైట్రా జెపామ్ -10 ఎంజీ మాత్రలను అక్రమంగా కలిగి ఉం డటంతో పాటు విక్రయిస్తున్న ముగ్గురిని రాజేంద్రనగర్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం, కామాటిపుర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1,840 నైట్రా జెపామ్ మాత్రలు, 184 స్ట్రిప్పులు, మూడు మొబైల్ ఫోన్లు, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 1.23 లక్షలు ఉం టుందని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు, మంగళవారం కామాటిపుర గార్స్ ఆసుపత్రి సమీపంలో మహ్మద్ అష్ఫాక్ (27) ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 800 నైట్రా జెపామ్ -10 ఎంజీ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అష్పాక్ ఈ మాత్రలను హతగలే రాంజానే రామ్ (20) , మహ్మద్ ఇమ్రాన్ (31) నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసులు రాంజానే రామ్ ను అరెస్ట్ చేసి అతని వద్ద 140 మాత్రలు, అత్తాపూర్ కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ వద్ద నుంచి 900 మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని మల్లెపల్లి లో నివాసం ఉండే రోహన్, కరణ్, నాడే అజయ్ నుంచి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఒక్కోక్క మాత్రను రూ.200లకు కొనుగోలు చేసి రూ.500లకు విక్రయిస్తున్నట్లు విచారణ లో తేలింది. రోహన్, కరణ్, నాడే అజయ్ పరారీలో ఉన్నారు.


డాక్టర్ సల్లా సౌజన్య


ఎస్ జయరాం

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారానే జీతాలు, హెల్త్ కార్డ్ సౌకర్యం కల్పించాలి

### ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

**బుద్వేల్, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగుల జీతాల చెల్లింపును యాధావిదిగా విశ్వవిద్యాలయం ద్వారానే కొనసాగించాలని బోధన, బోధనేతర ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డ్ సౌకర్యం కల్పించాలని టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రెండు సంఘాల ప్రతినిధులు టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ కు బుధవారం వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, ప్రత్యేక పరిపాలన, ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉందని పేర్కొన్నారు. జీతాలను ప్రభుత్వ ట్రెజరీ ద్వారా చెల్లించే విధానానికి మారడం వల్ల ఎస్ఎల్ఎస్, సప్లిమెంటరీ బిల్లులు, రుణాలు, అడ్వాన్సులు, అలవెన్సులు తదితర సర్వీస్ సంబందిత ఆర్థిక అంశాల్లో ఉద్యోగులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం విశ్వవిద్యాలయం ద్వారానే వేతనాలు చెల్లిస్తున్న పద్దతిని కొనసాగించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు అందుతున్న హెల్త్ కాడ్డు సౌకర్యాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర ఉద్యోగులకు, వారి అర్హత కలిగిన ఆధారిత కుటుంబ సభ్యులతో సహా అం దజేయాలన్నారు. టీ ఎన్ జీ ఓ స్ కేంద్ర సంఘం నాయకులను కలసిన వారిలో తెలంగాణ అగ్రికల్చర్ సైంటిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. పవన్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, నాన్-టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సులోచన, ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లు చరిత్రను, జ్ఞాపకాలను భద్రపరిచే కళాకారులు

## నీలం మధు ముదిరాజ్.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా ఫోటోగ్రాఫర్ల దినోత్సవం..

### జెండా ఎగురవేసి, కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు





**పటాన్ చెరు, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం) :**

ఒక ఫోటో అనేది కేవలం ఒక చిత్రం కాదని, అది ఒక కాలానికి, ఒక సంఘటనకు, ఒక జ్ఞాపకానికి శాశ్వత సాక్ష్యంగా నిలుస్తుందని అ ఫోటో మన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బాధ్యతను ఫోటోగ్రాఫర్లు నిర్వర్తిస్తున్నారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యాలయంలో వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన కార్యక్రమం, ప్రజా ఉద్యమం, సామాజిక పరిణామం, కుటుంబ వేడుకలను చిత్రాల రూపంలో భద్రపరచడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని నీలం మధు అన్నారు. ఎన్నో సంవత్సరాలు గడిచిన తర్వాత కూడ నాటి జ్ఞాపకాలను కళ్లముందు నిలిపేది ఫోటోగ్రఫీ అని పేర్కొన్నారు. అందుకే ఫోటోగ్రఫీ వృత్తిని ఎంచుకుని సేవలందిస్తున్న వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని గతంలో తాను చేయించిన హెల్త్ ఇన్సూరెన్సు కార్యక్రమాన్ని గుర్తుచేసుకున్నారు.. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, వారి వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాజేశ్వర్, ఇస్నాపూర్ ప్రెసిడెంట్ నరేందర్, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సందీప్, కౌన్సిలర్స్ సంఘన్నగారి గోపాల్, దస్తగిరి,లక్ష్మా రెడ్డి, మురళి, కృష్ణ యాదవ్,శంకర్, పవన్,రవి, రాజేష్, ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్

## ఆలయ పరిసరాలను శుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దాలి.. బీచుపల్లిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**

బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న కలెక్టర్ కు మొదట ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు కలెక్టర్ ను సన్మానించి, ప్రసాదాన్ని అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి పురంధర్ బీచుపల్లి క్షేత్ర విశిష్టతను కలెక్టర్ కు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణం పరిశీలించి భక్తులను ఆకట్టుకునేలా లైటింగ్, ఇతర అలంకరణ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో చెత్తాచెదారం, పందులను గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత కోసం అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీ పార్క్, ఫౌంటెన్‌ను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా నిర్వహించాలన్నారు. పరిసరాల్లో ఉన్న ఫంక్షన్ హాళ్లను నిబంధనల ప్రకారం నిర్వహించేలా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లోని హోటళ్లను నిబంధనల ప్రకారం అవసరమైన ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. నిజాం కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను పర్యాటక శాఖకు పంపించడం జరిగిందన్నారు. నదీతీరంలో సేవలందిస్తున్న గజ ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, రక్షణ తాళ్లు, రెస్క్యూ బోట్ వంటి పరికరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ నరేష్, ఈఓ పురేందర్, పంచాయితీ కార్యదర్శి అరుణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ రిజ్వాన్ షేక్ ను ఆశీర్వదిస్తున్న ఆలయ పూజారులు


బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో హారతి స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ షేక్

# గోదావరి ఫేజ్--2, 3 పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

## ఘన్‌పూర్‌లో 1170 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీ, 80 ఎంఎల్ ఎంబీఆర్ పనుల పరిశీలన

## 984 మీటర్ల పైప్‌లైన్ హైడ్రాలిక్ టెస్టింగ్‌ను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎండీ

## అదనపు గ్యాంగ్ లను రంగంలోకి దించి అక్టోబర్--2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని ఆదేశంలి

## ఇప్పటికే 10 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం పూర్తి





**హైదరాబాద్, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మహానగర భవిష్యత్ తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్--2, 3 పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత నిర్మాణ సంస్థలు, ప్రాజెక్టు ప్రతినిధులు, జలమండలి ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఘన్‌పూర్‌లో 1170 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలన:పర్యటనలో భాగంగా ముందుగా ఘన్‌పూర్ వద్ద నిర్మాణంలో ఉన్న 1170 ఎంఎల్‌డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను ఎండీ పరిశీలించారు. ప్లాంట్‌లోని వివిధ యూనిట్ల నిర్మాణ పురోగతి, సివిల్ పనులు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. డబ్ల్యూటీపీకి సంబంధించిన పనులను నిర్దేశిత కార్యాచరణ ప్రకారం వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, డబ్ల్యూటీపీకి సంబంధించిన వివిధ విభాగాల పనులు సమాంతరంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.

**80 ఎంఎల్ ఎంబీఆర్ పనుల సమీక్ష:**

అనంతరం ప్రాజెక్టులో కీలకమైన 80 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణ పురోగతి, మిగిలిన పనులు, వాటిని పూర్తి చేసేందుకు రూపొందించిన కార్యాచరణపై సమీక్షించారు. డబ్ల్యూటీపీ, ఎంబీఆర్, పైప్‌లైన్ పనులు ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉన్నందున అన్ని పనులను సమన్వయంతో, సమాంతరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్యాకేజీ--1, ప్యాకేజీ--2 పైప్‌లైన్ పనుల పరిశీలన:గోదావరి ఫేజ్--2, 3లో భాగంగా కొనసాగుతున్న ప్యాకేజీ--1, ప్యాకేజీ--2 పైప్‌లైన్ పనులను ఎండీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పైపుల తయారీ, రవాణా, ట్రెంచింగ్, పైప్‌లైన్ నిర్మాణం, వెల్డింగ్, జాయింటింగ్ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన మ్యాన్‌పవర్, యంత్ర సామగ్రిని పెంచాలని, మరిన్ని వర్కింగ్ గ్యాంగ్‌లను రంగంలోకి దించి ఒకేసారి వివిధ ప్రాంతాల్లో పనులు చేపట్టాలని రెండు ప్యాకేజీల నిర్మాణ సంస్థలకు స్పష్టం చేశారు.

**10కిమీ పైప్ లైన్ నిర్మాణం పూర్తి:**

ఇప్పటికే ప్యాకేజీ--1, ప్యాకేజీ--2 పరిధిలో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులను ఎండీ పరిశీలించారు. ఇప్పటివరకు సుమారు 10 కి.మీ. మేర పైప్‌లైన్ పనులు పూర్తయినట్లు అధికారులు ఎండీకి వివరించారు. పైపుల తయారీ, రవాణా, లేయింగ్, వెల్డింగ్, జాయింటింగ్ తదితర పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. అవసరమైన మ్యాన్‌పవర్, యంత్ర సామగ్రిని పెంచడంతో పాటు మరిన్ని వర్కింగ్ గ్యాంగ్‌లను రంగంలోకి దించి వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో పనులు చేపట్టాలని నిర్మాణ సంస్థలకు ఆదేశించారు.

984 మీటర్ల పైప్‌లైన్‌కు హైడ్రాలిక్ టెస్టింగ్:

పర్యటనలో భాగంగా చైనేజ్ 19.5 కి.మీ. నుంచి 20.5 కి.మీ. మధ్య 984 మీటర్ల పొడవున ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు నిర్వహించిన ఫీల్డ్ హైడ్రాలిక్ టెస్టింగ్‌ను ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. పైప్‌లైన్ సామర్థ్యం, జాయింట్ల పటిష్ఠత, లీకేజీలు లేకుండా నిర్దేశిత ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు నిర్వహించే హైడ్రాలిక్ టెస్టింగ్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి దశలో నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, నాణ్యతా నియంత్రణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.

**అక్టోబర్ 2027 నాటికి పూర్తి చేయాలి:**

ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్యాకేజీ--1, ప్యాకేజీ--2కు సంబంధించిన పనుల్లో మరింత వేగం పెంచి అక్టోబర్--2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించారు. ప్రస్తుతం పనిచేస్తున్న బృందాలకు అదనంగా మరిన్ని గ్యాంగ్‌లను ఏర్పాటు చేయాలని, అవసరమైన మ్యాన్‌పవర్, యంత్ర సామగ్రి, మెటీరియల్‌ను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట మైలురాళ్లు నిర్ణయించుకుని వాటి ప్రకారం పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, జలమండలి ఇంజినీరింగ్ అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

**హైదరాబాద్ తాగునీటి భద్రతకు కీలకం:**

రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్--2, 3 ద్వారా మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మొత్తం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించనున్నారు. ఇందులో 17.50 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మరో 2.50 టీఎంసీలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పునరుజ్జీవనం, మూసీ పునరుజ్జీవనానికి వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరానికి అదనపు తాగునీటి వనరు అందుబాటులోకి రావడంతో పాటు భవిష్యత్ తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. మహేష్ కుమార్, జీఎం, డీజీఎంలు, ఇతర ప్రాజెక్టు అధికారులు, సంబంధిత నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నందిగామ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 19 (ప్రభాత ఉదయం)**

పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో బుధవారం నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రం అందిస్తున్న జానపద కళాకారులు..

# జానపద కళాకారుల పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లిస్తాం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

### రూ.11 కోట్ల బకాయిల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు. కళాకారులు ఆందోళన చెందవద్దని భరోసా

**శేరిలింగంపల్లి : ఆగస్టు 19, (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని జానపద కళాకారుల సమస్యల పరిష్కారానికి వారు ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. 'జానపద కళాకారుల ఐక్యవేదిక' ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. 2023 నుంచి 2026 వరకు భాషా-సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు ఉత్సవాల్లో పాల్గొన్న తమకు పారితోషికాలు ప్రయాణ ఖర్చులకు సంబంధించి సుమారు రూ.11 కోట్ల మేర బకాయిలు నిలిచిపోయాయని ప్రతినిధులు మంత్రికి వివరించారు. సొంత ఖర్చులతో ప్రదర్శనలకు హాజరై, నెలల తరబడి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, అధికారులను పిలిపించి తక్షణ చర్యలకు ఆదేశించారు.

**మంత్రి జూపల్లి కీలక ఆదేశాలు**

ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి పెండింగ్ బిల్లుల విడుదల ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డితో మాట్లాడి అర్హులైన కళాబృందాల వివరాలను త్వరితగతిన పరిశీలించి చెల్లింపులు చేయాలన్నారు. ఎండోమెంట్ శాఖ నుంచి రావాల్సిన నిధులను సమన్వయం చేయాలని సూచించారు. కళాకారులకు ఐడీ కార్డులు, గుర్తింపు పత్రాలు, పెన్షన్లు, అవార్డుల సత్కారాలు అందించేలా చర్యలు చేపడతామన్నారు. కళాకారులు ఆందోళన చెందవద్దని, తమ సమస్యలను గౌరవప్రదమైన పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతున్న జానపద కళాకారులను ఆదుకుంటామని ప్రభుత్వం నుంచి సానుకూల హామీ రావడంతో జానపద కళాకారుల ఐక్యవేదిక ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్ కుమార్, ఒగ్గు రవి, సోమరాజు శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న 90 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీలో (మిషన్ భగీరథ గ్రిడ్ ) వివిధ రకాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని బుధవారం సమ్మెకు పూనుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మిషన్ భగీరథ గ్రిడ్‌లో ఐహెచ్పీ, ఎక్సలైంట్, మెగా కంపెనీలకు చెందిన లైన్ మెన్, ఫిటర్స్, బ్యాక్ వాష్ ఆపరేటర్స్ గా పని చేస్తున్నారు. ఇందులో ఐహెచ్ పి, ఎక్సలెంట్ కంపెనీలకు చెందిన సుమారు 200మంది కార్మికులకు గత ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదని కార్మికులు ఆరోపించారు. మిషన్ భగీరథ పథకంలో తాగునీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికులకు 8 నెలలుగా వేతనాలు అందడంలేదు అని కార్మికులకు ప్రతినెల వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిబంధన విదించినప్పటికీ ఐహెచ్ పీ,ఎక్సలెంట్ కంపెనీలకు చెందిన కాంట్రాక్టర్లు అవేవి పట్టించుకోవడంలేదు అని ఆరోపించారు. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు తాగునీటిని అందించే తమ కుటుంబాలు గడవక ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడంలేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు.. ప్రభుత్వం స్పందించి తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలుచెల్లించేలా కాంట్రాక్టర్లను ఆదేశించాలని కార్మికులు కోరుతున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తదుపరి దశను పకడ్బందీగా చేపట్టాలి

**క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలపై ప్రత్యేక దృష్టి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**







రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో తదుపరి దశలో చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పరిశీలన, మ్యాపింగ్ ప్రక్రియలో నమోదైన వివిధ కేటగిరీల కేసుల వివరాలను ఆయన సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు, తదుపరి దశలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, హై మ్యాపింగ్, నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షలకు పైగా కేసులు వివిధ కేటగిరీల కింద ఉన్నందున, భారీ పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సంబంధిత కేటగిరీల వివరాలు భారత ఎన్నికల సంఘం వద్ద కూడా అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి అవసరమైన తదుపరి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు.తదుపరి దశలో సుమారు 93 లక్షల కేసుల పని భారం ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇందులో సుమారు 32 లక్షల కేసులు నో మ్యాపింగ్, సుమారు 60 లక్షల కేసులు అనామలీస్ కేటగిరీకి సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. అనామలీస్ కేటగిరీ కేసులు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా జీహెచ్ఎంసీ, హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు అధికంగా ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచించారు. జిల్లాల వారీగా కేసుల సంఖ్య, అందుబాటులో ఉన్న సిబ్బంది, నియోజకవర్గాల వారీగా పని భారాన్ని పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.అదనపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు , ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని పని భారాన్ని సమన్వయంతో పంచుకుని కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి కేటగిరీకి సంబంధించిన కేసులను నిర్ణీత విధానంలో పరిశీలించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**నోటీసుల జారీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి**

కేసుల పరిష్కారంలో భాగంగా నోటీసుల జనరేషన్, ప్రింటింగ్, సంబంధిత వ్యక్తులకు నోటీసుల జారీ, నోటీసు కాలవ్యవధిలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిశీలన, తుది పరిష్కారం వంటి ప్రతి దశను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సుదర్శన్ రెడ్డి సూచించారు.భారీ సంఖ్యలో ఉన్న కేసులను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా స్పష్టమైన బాధ్యతలు కేటాయించి, ఈ ఆర్ ఓ లు, అదనపు ఈ ఆర్ ఓ లు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్న నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీ కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, మొత్తం ప్రక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**జిల్లాలో పకడ్బందీగా మ్యాపింగ్, నాన్--మ్యాపింగ్ కేసుల పరిశీలన**

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, నాన్--మ్యాపింగ్ కేసులను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.మ్యాపింగ్, నాన్--మ్యాపింగ్‌కు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చోట సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలన, సర్వే అనంతరం వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సుమారు 5.60 లక్షల నాన్--మ్యాపింగ్ కేసులు, 6.70 లక్షల మ్యాపింగ్/నాన్--మ్యాపింగ్‌కు సంబంధించిన కేసులు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు 2.73 లక్షల సేవింగ్స్/నాన్--మ్యాపింగ్ కేటగిరీ కేసులు ఉన్న నేపథ్యంలో వాటిని కూడా ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

మొత్తం 85 రోజుల సమయం ఉన్నందున, ప్రక్రియను పకడ్బందీగా, సమగ్రంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను గుర్తించి, ఎన్ని నోటీసులు జారీ చేయాలి, ఎవరికి నోటీసులు ఇవ్వాలి, తదుపరి చేపట్టాల్సిన చర్యలు ఏమిటనే అంశాలపై పోలింగ్ స్టేషన్ వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.నోటీసుల జారీ ప్రక్రియను బుధవారం సాయంత్రం నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, గురువారం నుంచి ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. నోటీసుల జారీ అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను పరిశీలించి, పునఃపరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.జిల్లాలో అధిక సంఖ్యలో కేసులు ఉన్న మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అధిక సంఖ్యలో కేసులు ఉన్న ప్రాంతాల్లో ముందుగా చర్యలు చేపట్టి, అవసరమైన వివరాలను వీలైనంత త్వరగా సేకరించి సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశించారు.ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని కేసులను క్షుణ్ణంగా గుర్తించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, నిర్ణీత గడువులోగా నోటీసుల జారీతో పాటు తదుపరి పరిశీలన, సర్వే, పునఃపరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియలను సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి కేసును నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ వివరాలను నిర్ధారించిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉండేలా, ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో భారీ చోరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చొరబడి 6.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.30 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.... గద్వాల పట్టణం బీరొల్లు చౌరస్తాలో సమీపంలో నివసించే విజయ్, అతని భార్య ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఉద్యోగాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళం పగలగొట్టడాని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి పడకగదిలోని బీరువాలో ఉన్న 6.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.30 లక్షల నగదు దోచుకెళ్లారు. బాధితులు గద్వాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ కళ్యాణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## జూరాలకు మళ్లీ ప్రారంభమైన వరద

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**

కర్ణాటకలోని నారాయణపూర్ డ్యాం గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేయడంతో జూరాలకు వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో బుధవారం ఉదయం జూరాలకు వస్తున్న వరద ప్రవాహం క్రమంగా పెరుగుతూ వస్తోంది. బుధవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల వరద వస్తున్న క్రమంలో పీజేపీ అధికారులు ప్రాజెక్టు 6 గేట్లను ఓపెన్ చేసి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే జూరాలకు ఇన్‌ఫ్లో 65 వేల క్యూసెక్కులు ఉండ గా, అవుట్‌ఫ్లో 70,687 క్యూసెక్కులు నమోదైంది. విద్యుదుత్పత్తికి 40,978 క్యూసెక్కు లు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు గరిష్ఠనీటి మట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 318.34 మీటర్ల నీటి మట్టం ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.296 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

## నేడు శంషాబాద్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**శంషాబాద్, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**



శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా తెలిపారు. పెద్ద గోల్కొండ , సంఘిగూడ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలలో 10:00 నుండి 14:00 వరకు , 14:30 నుండి 17;00 వరకు, నిర్వహణ , చెట్ల నరికివేత కారణంగా సంఘిగూడ గ్రామం,పెద్ద గోల్కొండగ్రామం, రాయికుంట, శ్రీ కృష్ణఫార్మా, హర్షగూడ,శంకరాపురం రోడ్డు, ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయనపేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా కొనసాగిన వరుణ యాగ కొనసాగింపు పాదయాత్ర

**దాదాపు 10 కిలో మీటర్లు పాదయాత్ర చేసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ .**

**కృష్ణ తుంగ భద్ర జలాలతో శివుడి అభిషేకం**

**వందలాదిగా తరలివచ్చిన రైతులు మహిళలు**

**ఏండ్ల బండ్లతో డప్పు చప్పుళ్ళతో ఆట పాటలతో కొనసాగిన పాదయాత్ర**


**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**



ఎల్ నినో కారణంగా వర్షాలు కురవకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన వరుణ యాగానికి కొనసాగింపుగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గం లో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఈశ్వరమ్మ ఆలయం నుంచి జులేకల్ శివాలయం వరకు పాదయాత్ర చేసి కృష్ణ తుంగభద్ర జలాలతో శివుడి కి అభిషేకం చేశారు అలంపూర్ నియోజక వర్గం ఏళ్ల. వేళలా పాడి పంటలతో పచ్చగా ఉండాలని కరువు కటకాలు ఈ ప్రాంత రైతులకు రాకుండా ఉండాలని ఆ వరుణ దేవుడు కృప ఎల్లప్పుడూ ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని మనసారా భగవంతుడు నీ ప్రార్థిస్తున్నాను అన్నారు .ఈ కార్యక్రమంలో అన్ని మండలాల మండల అధ్యక్షులు ,జిల్లా నాయకులు,రైతు సంఘాల నాయకు,మహిళలు,రైతులు,మాజీ ,తాజా సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు19(ప్రభాత ఉదయం)**



గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాఘవేంద్ర కాలనీ సమీపంలో పేకాట స్థావరం పై బుధవారం గద్వాల టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులో ముగ్గురు పేకటారాయుళ్లను అదుపు లోకి తీసుకుని వారి నుంచి రూ.7,500 నగదు, మూడు సెల్ ఫోన్ లు , రెండు బైక్ లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 19(ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణంలో నూతనంగా పునః నిర్మించిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున నూతన దేవాలయాల ప్రారంభోత్సవ వేడుకలు ఈ నెల 19 నుంచి 23వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ప్రారంభోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మేడవరం సంజీవ శర్మ, కర్నూల్ టౌన్ పురోహితులు ములుకుట్ల ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, మాతృకా పూజ, రక్షాబంధనము, పంచగవ్య మెళన ప్రాశనములు, ఋత్విగ్వరణము, మహాయాగ మంటపప్రవేశము, షోడశస్తంభ పూజలు, ద్వారతో రణపూజలు ప్రధాన కలశ స్థాపనము, ప్రధాన దేవతల ఆహ్వానము యంత్ర అభిషేకములు మూల యంత్ర జపములు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేశారు.అభిషేకములు మూల యంత్ర జపములు మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ. సాయంత్రం మృత్సంగ్రహణము, అంకురార్పణము, అగ్ని ప్రతిష్టాపనము, దీక్షాహోమము, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు.


## కృష్ణానదిలో దూకి అవివాహిత ఆత్మహత్య యత్నం

**ప్రాణాలు కాపాడిన మత్స్యకారుడు**

**గద్వాల జిల్లా ప్రతినిధి 19(ప్రభాత ఉదయం)**



తండ్రి వేధింపులు, చిత్రహింసలు తట్టుకోలేక ఒక అవివాహిత మహిళ కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. మత్స్యకారుడు సమయస్ఫూర్తితో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు తెలిపినవివారాలిలా ఉన్నాయి... ఐజ మండలం పులికల్ గ్రామానికి చెందిన ఒక మహిళ, తన తండ్రి ప్రవర్తనపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున ఎర్రవల్లి మండలం బీచుపల్లి సమీపంలోని కృష్ణా నదిలో దూకింది. అక్కడే ఉన్న మత్స్యకారుడు ముదిరాజ్ బాబు తక్షణమే గమనించి, బోటు సహాయంతో నదిలోకి వెళ్లి ఆమెను సురక్షితంగా బయటకు తీసి ప్రాణాలు కాపాడారు."మా తండ్రి మద్యానికి బానిసై ప్రతినిత్యం అమ్మను, మమ్మల్ని తీవ్రంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. గతంలో నా సోదరి కూడ ఆత్మహత్యాయత్నం చేసినా అతనిలో ఏ మార్పు రాలేదు. పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మాకు న్యాయం జరగలేదు. నా చావుతోనైనా అతనికి తగిన శిక్ష పడుతుందని, కుటుంబానికి టార్చర్ తప్పుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాను." అని మహిళ ఆరోపించింది. కొండపేట గజఈతగాళ్ల ద్వారా సమాచారం అందుకున్న స్థానిక ఇటిక్యాల ఎస్ఐ రవి, సిబ్బంది శ్రీను, రాజశేఖర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలి వివరాలు సేకరించి, ఆమె మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె బంధువులకు సమాచారం అందించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.




సైబర్ క్రైమ్ మోసం పోయిన బాధితుడికి కోటి రూపాయల చెక్కును అందిస్తున్న సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్ తోపాటు సైబర్ క్రైమ్ డిసిపి పుష్ప ఇతర అధికారులు..

## నకిలీ వాట్సాప్ ప్రొఫైల్‌తో రూ.1 కోటి మోసం

**10 రోజుల్లోనే పూర్తి రికవరీ చేసిన సైబరాబాద్ పోలీసులు**

**పోలీసుల వేగవంతమైన చర్యలతో బాధితుడికి రూ.1 కోటి అందజేత**

**ఉత్తరప్రదేశ్‌లో నిందితుడి అరెస్ట్; మ్యూల్ ఖాతా గుట్టు రట్టు**

**వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**

**శేరిలింగంపల్లి : ఆగస్టు 19, (ప్రభాత ఉదయం)**

యజమాని డిస్‌ప్లే పిక్చర్ తో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించి ఏకంగా రూ.1 కోటి కాజేసిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. మోసపోయిన మొత్తం రూ.1 కోటిని కేవలం 10 రోజుల్లోనే చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియ ద్వారా రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. సైబరాబాద్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీపీ డా. ఎం. రమేష్ వెల్లడించారు. ఈ నెల 4న నగరంలోని ఒక చీరల రిటైల్ సంస్థ అకౌంటెంట్‌కు తన యజమాని పేరు, ఫొటోతో ఉన్న వాట్సాప్ నంబర్ నుండి అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలనే సందేశం వచ్చింది. అది నిజంగానే యజమాని పంపారని భావించిన అకౌంటెంట్, సంస్థకు చెందిన కరూర్ వైశ్య బ్యాంక్ ఖాతా నుండి కోటి రూపాయలను నిందితుడు సూచించిన ఇండస్ఇండ్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశారు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు నిధుల మళ్లింపు ఆధారంగా శోధించారు. ఈ డబ్బు ' రాయల్ మోడ ప్రైవేట్ లిమిటెడ్.' పేరిట ఉన్న కరెంట్ అకౌంట్ కి వెళ్లినట్లు గుర్తించారు. బ్యాంక్ లావాదేవీల విశ్లేషణ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన వాటర్ ప్లాంట్ వ్యాపారి దీపక్ కుమార్ (37) ను ప్రధాన నిందితుడిగా తేల్చారు. ఆగస్టు 8న లక్నోలో నిందితుడిని అరెస్ట్ చేసి, ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం కూకట్‌పల్లిలోని అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించింది.

**10 రోజుల్లోనే వంద శాతం రికవరీ:**

పోలీసుల తక్షణ స్పందన రంగారెడ్డి కోర్టు కూకట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి ఉ త్తర్వుల మేరకు, మోసపోయిన రూ.1 కోటిని సంఘటన జరిగిన 10 రోజుల్లోనే పూర్తిగా సురక్షితంగా రికవరీ చేసి బాధితుడికి అందించినట్లు సీపీ వివరించారు. నిందితుడి ఖాతాకు దేశవ్యాప్తంగా మరిన్ని సైబర్ నేరాలతో సంబంధాలు ఉన్నట్లు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా వెల్లడైంది.

**సైబరాబాద్ సీపీ జాగ్రత్తలు సూచనలు:**

వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోలు, డిస్‌ప్లే పేర్లను చూసి ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. అత్యవసర డబ్బు బదిలీ మెసేజ్ వస్తే నేరుగా ఫోన్ చేసి ధృవీకరించుకోవాలి.

వాట్సాప్ లేదా ఇతర యాప్స్‌లో వచ్చే తెలియని ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయకూడదు. సైబర్ మోసం జరి గిన వెంటనే 1930 కాల్ సెంటర్ ద్వారా లేదా ఎన్సీ ఆర్పి పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బులు సురక్షితంగా రికవరీ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సైబర్ క్రైమ్స్ డీసీపీ కె. పుష్ప, ఏసీపీ ఎ. రవీందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎ. మన్మోహన్, ఎస్ఐ శ్రీనివాసులు వారి బృందాన్ని సీపీ ఎం. రమేష్ అభినందించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608